## ‘ప్రజావాణి’లో 39 ఫిర్యాదులు

**కూకట్‌పల్లి:** కూకట్‌పల్లి జీహెచ్‌ఎంసీ జోనల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం జరిగింది. ఈ ప్రజావాణిలో పలువురు తమ సమస్యలపై కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌కు ఫిర్యాదులు అందజేశారు. ఇంజినీరింగ్–15, ఎలక్ట్రికల్–6, ఎంటమాలజీ–2, టౌన్ ప్లానింగ్–16 మొత్తం 39 ఫిర్యాదులు అందాయని తెలిపారు. ప్రజావాణిలో ప్రజలు అందజేసిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని జోనల్ కమిషనర్ అధికారులను ఆదేశించారు.

## దాతలు ముందుకు రావాలి

**మూసాపేట:** కూకట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం నిర్మాణానికి దాతలు ముందుకు రావాలని కూకట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటయ్య కోరారు. కళాశాలలో 1200 మంది విద్యార్థులు చదువుతున్నారని, డిగ్రీ, జూనియర్ కళాశాల ఒకే ఆవరణలో ఉండటంతో షిఫ్టుల వారీగా కళాశాల తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. తరగతి గదులు కూడా రేకుల షెడ్డు కింద జరుగుతున్నాయన్నారు. కళాశాల భవన నిర్మాణానికి దాతలు సహకరించాలని ఆయన కోరారు.

## సావిత్రిబాయి పూలేకు ఘన నివాళి



మూసాపేటలో నివాళులర్పించిన వినయ్ కుమార్, హరికృష్ణ తదితరులు

**మూసాపేట:** మూసాపేటలో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వర్కింగ్ చైర్మన్ తూము వినయ్ కుమార్ ఆధ్వర్యంలో ఆయన కార్యాలయంలో సావిత్రి బాయి పూలే వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీసీ నేతలు మాట్లాడుతూ.. అణగారిన వర్గాల్లో విద్యావ్యాప్తి కోసం కృషి చేసిన గొప్ప సంఘసంస్కర్త సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. ఆమె ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ జర్నలిస్టు ఫోరం అధ్యక్షుడు తెల్ల హరికృష్ణ, సంతోష్, అవినాష్, టింకు, శ్రీకాంత్, లక్ష్మి, నారాయణ, సాయి, ప్రసాద్ ఉన్నారు.

## ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు చర్యలు చేపట్టాలి



జిల్లా అడిషనల్ కలెక్టర్ డి.విజయేందర్ రెడ్డికి ఫిర్యాదు చేస్తున్న శ్రీనివాస్ తదితరులు

**నిజాంపేట్ :** ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురికాకుండా పరిరక్షించాలని బాచుపల్లి మండల సీపీఐ కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు మేడ్చల్ జిల్లా సీపీఐ సహాయ కార్యదర్శి దామోదర్‌రెడ్డితో కలిసి మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అడిషనల్ కలెక్టర్ డి.విజయేందర్ రెడ్డికి సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో భూకబ్జాలు అధికమయ్యాయని ఈ విషయంలో మున్సిపల్, రెవెన్యూ అధికారులు పూర్తిగా విఫలం అయ్యారని ఆరోపించారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా సీపీఐ కౌన్సిల్ సభ్యులు ఈశ్వర్, యాదయ్య, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# యువతకు వెలుగునిస్తున్న లైట్ హౌస్

**పేద, మధ్య తరగతి విద్యార్థులకు చేయూత**



విద్యార్థినులు, మహిళలు టైలరింగ్ శిక్షణ తీసుకుంటున్న దృశ్యాలు

- కంప్యూటర్, సాఫ్ట్ స్కిల్స్ శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశాలు
- మహిళలకు స్వయంఉపాధి కోసం ప్రత్యేక కోర్సులు
- జీహెచ్‌ఎంసీ, దాతల అండగా లైట్‌హౌస్ కమ్యూనిటీ నిర్వహణ

**చందానగర్:** పేద, మధ్య తరగతి యువతకు కనీస విద్యార్హతలు ఉన్నప్పటికి కంప్యూటర్ పరిజ్ఞానం, సాఫ్ట్‌స్కిల్స్ ఉండడం లేదు. దీంతో వారు అనుకున్న లక్ష్యాలను చేరలేకపోతున్నారు. శిక్షణ తీసుకోవాలంటే వేల రూపాయలు ఖర్చు చేయాల్సిందే. ఇక నేడు కంప్యూటర్‌పై కనీస పరిజ్ఞానం లేకపోతే ఉద్యోగం రాని పరిస్థితి నెలకొంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని మహారాష్ట్ర పూణెకు చెందిన గణేష్ నటరాజన్, రుచి మాధుర్‌లు కలిసి ‘లైట్ హౌస్’ కమ్యూనిటీస్‌ను ప్రారంభించారు. యువతకు అవసరమైన కంప్యూటర్ పరిజ్ఞానం, ఇంటర్వ్యూలకు ఎలా సిద్ధం కావాలి, ఇంగ్లిష్ మాట్లాడడం, మహిళలకు బ్యూటీషియన్, టైలరింగ్, ఎంబ్రాయిడరీతో పాటు 22 కోర్సులకు శిక్షణ ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. భారతదేశంలో పలు రాష్ట్ర ప్రభుత్వాలు, దాతల సహాయంతో లైట్‌హౌస్‌లు ఏర్పాటు చేసి యువతకు శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటి వరకు పూణె, ఒడిశా, ముంబయి, ఢిల్లీ, లక్నో, హైదరాబాద్‌లలో 32 లైట్ హౌస్ కేంద్రాలు ఉన్నాయి. కోర్సులు ఉచితంగా నేర్పించి 80 శాతం యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు.



- రాష్ట్రంలో 2023 సంవత్సరంలో మొట్టమొదటి లైట్ హౌస్‌ను జీహెచ్‌ఎంసీతో కలిసి చందానగర్ హుడా కాలనీలో ఉన్న మోడల్ మార్కెట్ భవనంలో ఏర్పాటు చేశారు.
- యువతీ, యువకులకు సుమారు 22 రోజులు ఫౌండేషన్ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు.
- నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి పేద, మధ్య తరగతి యువత వారికి కావలసిన కోర్సులలో శిక్షణ పొందుతున్నారు.
- యువకులకు ట్యాలీ, జావా, స్పోకెన్ ఇంగ్లిష్ నేర్పిస్తున్నారు. బడుగు, బలహీన వర్గాలకు చెందిన ఆడపిల్లలకు కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లిష్, బ్యూటీషియన్ కోర్సు, టైలరింగ్, ఎంబ్రాయిడరీపై శిక్షణ ఇస్తున్నారు.
- లైట్ హౌస్‌లో 12 మంది ట్రైనర్లు శిక్షణ ఇస్తారు.



చందానగర్ హుడా కాలనీలోని లైట్ హౌస్ ఇదే..

ఫౌండేషన్ కోర్సు 22 రోజులు.. 3 నెలల పాటు మెళకువలు నేర్పిస్తారు. ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటలకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు.

- నేటి వరకు 40 బ్యాచ్‌లతో 920 మంది యువత శిక్షణ కోసం నమోదు చేసుకోగా ఇప్పటి వరకు 418 మంది ఉద్యోగాలు పొందారు. 291 మంది వివిధ కోర్సులలో శిక్షణ పూర్తి చేసుకున్నారు.
- ఐటీ ఉద్యోగులు వచ్చి యువతకు కావలసిన కోర్సులలో పాఠాలు చెబుతున్నారు.
- జీహెచ్‌ఎంసీ పరిధిలో ఇటీవల మల్లేపల్లిలో ప్రారంభించారు. నగరంలో మరో మూడు లైట్‌హౌస్‌లు కూకట్‌పల్లి, బోరబండ, ఎల్బీనగర్‌లలో ఏర్పాటు చేయనున్నారు.
- లైట్ హౌస్‌లో కోర్సులలో చేరాలంటే 18–35 సంవత్సరాల వరకు పరిమితి ఉంది. ఆధార్ కార్డు, విద్యార్హతకు సంబంధించిన సర్టిఫికెట్ ఉండాలి.



వివిధ కోర్సుల్లో శిక్షణ పూర్తి చేసుకొని సర్టిఫికెట్లు పొందిన యువత

### ఉచిత శిక్షణ ఇస్తున్నాం



చందానగర్‌లోని లైట్ హౌస్‌లో పేద, మధ్య తరగతి యువతకు కంప్యూటర్.. వివిధ రకాల కోర్సులు ఉచితంగా నేర్పిస్తున్నాం. ఉద్యోగ అవకాశాల కోసం వెతుకుతున్న పేద యువత కోసం పని చేస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం, జీహెచ్‌ఎంసీల సహాయంతో మరిన్ని లైట్ హౌస్ కేంద్రాలను ఏర్పాటుచేస్తున్నాం. 40 బ్యాచ్‌లతో 920 మంది యువత నమోదు చేసుకున్నారు.

– శ్రీనివాస్ ఆకుల, మేనేజర్, లైట్‌హౌస్

## కల్యాణం..కమనీయం



కల్యాణ వేడుకల్లో ఎమ్మెల్యే గాంధీ తదితరులు

**ఆల్విన్‌కాలనీ:** వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని సప్తగిరి కాలనీలోని కార్యసిద్ధి గణపతి, సుబ్రహ్మణ్య స్వామి, జంట నాగుల, నవగ్రహ సహిత భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో సోమవారం భ్రమరాంబ మల్లికార్జున స్వామి కల్యాణం జరిగింది. ఈ వేడుకల్లో పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాయినేని చంద్రకాంత్‌రావు, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, అల్లం మహేష్, ప్రవీణ్ యాదవ్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## మౌలిక వసతులు కల్పించాలి



జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ సబిహా బేగం

**మోతీనగర్:** అల్లాపూర్ డివిజన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సోమవారం కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌కు కార్పొరేటర్ సబిహా బేగం, పలు సంక్షేమ సంఘాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..వీధి లైట్లు, సీసీ రోడ్డు, కమ్యూనిటీ హాలు, పారిశుద్ధ్యం, తాగునీరు వంటి మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ వినతిపత్రం అందజేశామన్నారు. తాను విన్నవించిన సమస్యలను జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించడంతో పాటు ఆయా శాఖాధికారులతో త్వరలో సమావేశమై ఆయా అభివృద్ధి పనులకు ప్రణాళికలు సిద్ధం చేసి నిధులు మంజూరయ్యే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు.

## మహిళా ఉపాధ్యాయులకు సన్మానం



మహిళా సమైక్య సభ్యులు ఆర్‌పీలకు సన్మానం చేస్తున్న మురళీ తదితరులు

**బాలానగర్:** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బాలానగర్ మండలంలోని మహిళా ఉపాధ్యాయులను మండల విద్యాధికారి హరిచందర్ సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని, మహిళా వివక్ష లేని సమాజం ఏర్పడాలని, మహిళా సాధికారత మరింత జరగాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు, జీటీఏ, పీఆర్‌టీయూ, టీఎస్‌యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

**మహిళా సమైక్య సభ్యులు, ఆర్‌పీలకుసన్మానం..**

**మోతీనగర్:** స్త్రీ సమజానికి మూల స్తంభం లాంటిదని జీహెచ్‌ఎంసీ మూసాపేట సర్కిల్ కమ్యూనిటీ ఆర్గనైజర్ కొండబత్తిని మురళీ పేర్కొన్నారు. సోమవారం మూసాపేట డివిజన్, మోతీనగర్, మూసాపేట వార్డు కార్యాలయంలో మహిళా దినోత్సవంలో భాగంగా మహిళా సమైక్య సభ్యులు, ఆర్‌పీలకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మహిళలు క్రీడలు, విద్యా, వ్యాపార రంగాల్లో ముందుడుగు వేయాలన్నారు. మహిళల భద్రత ముఖ్యమైన అంశం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘాల సమైక్య సభ్యులు సెలస్టినా, పుష్పలత, రాధారాణి, శ్రీలక్ష్మి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థినులకు ల్యాప్‌టాప్‌ల అందజేత




**కేపీహెచ్‌బీకాలనీ:** ప్రతిభావంతులైన విద్యార్థినులను ప్రోత్సహించేందుకు అనన్య సంస్థ 15 ల్యాప్‌టాప్‌లను పంపిణీ చేశారు. జేఎన్‌టీయూహెచ్ ఇంజినీరింగ్ కళాశాల, బెంగళూరు కేంద్రంగా ఉన్న అనన్య ఎన్‌జీఓల మధ్య కుదిరిన ఒప్పందంలో భాగంగా సోమవారం ఆర్థికంగా వెనుకబడిన, ప్రతిభావంతులైన విద్యార్థినులకు ల్యాప్‌టాప్‌లను అందజేశారు. అనన్య సంస్థ విద్యార్థులకు ఉద్యోగ నైపుణ శిక్షణ కూడా అందిస్తుందన్నారు. తద్వారా కళాశాల, వృత్తి జీవితాల మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించేందుకు తోడ్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్, ప్రొఫెసర్ టి.కిషన్ కుమార్‌రెడ్డి, డైరెక్టర్ ప్రొఫెసర్ కె.విజయకుమార్‌రెడ్డి, అనన్య సీఈఓ మహాలక్ష్మి పార్థసారథి, ప్రిన్సిపాల్, ప్రొ. జి.వెంకట నరసింహారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ పద్మావతి, ట్రెనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ప్రొఫెసర్ కె. సురేష్‌బాబు పాల్గొన్నారు.

## నీటిని పొదుపుగా వాడుకోవాలి



సమావేశంలో కార్పొరేటర్ రవీందర్ రెడ్డి

**బాలానగర్:** వేసవిలో నీటి సరఫరాను నిరంతరాయంగా అందించడానికి జలమండలి అధికారులతో సోమవారం బాలానగర్ కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎండాకాలంలో నీటి డిమాండ్ పెరుగుతుందని, దీనిని దృష్టిలో ఉంచుకొని నీటి సరఫరా వ్యవస్థలో ఏవైనా లోపాలు ఉంటే వాటిని గుర్తించి సరిచేసి ఒకవేళ నీటి కొరత ఏర్పడే అవకాశం ఉంటే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని అధికారులకు సూచించారు. ఎండాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలందరూ నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బాలానగర్ జలమండలి మేనేజర్ అనిల్‌కుమార్, కూకట్‌పల్లి జలమండలి మేనేజర్ సతీష్‌కుమార్, లైన్‌మెన్లు తదితరులు పాల్గొన్నారు.

## డంపింగ్ యార్డులో రీ సైక్లింగ్ వస్తువులను తీసుకునేందుకు అనుమతి ఇవ్వాలి

**శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయానికి తరలి వచ్చిన స్వచ్ఛ ఆటో కార్మికులు**



కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న నాయకులు రాజేందర్, గోపాల్‌నాయక్ తదితరులు

**శేరిలింగంపల్లి:** దీప్తిశ్రీనగర్ డంపింగ్ యార్డులో రీ సైక్లింగ్ వస్తువులను తీసుకునేందుకు తమకు అనుమతి ఇవ్వాలని స్వచ్ఛ ఆటో కార్మికులు జోనల్ కమిషనర్‌ను కోరారు. సోమవారం స్వచ్ఛ ఆటో డ్రైవర్లు, తెలంగాణ స్వచ్ఛ ఆటో టిప్పర్, రిక్షా కార్మికుల యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయానికి భారీగా తరలివచ్చారు. చందానగర్ సర్కిల్‌కు చెందిన ఆటో డ్రైవర్లు రోజు కాలనీల నుంచి సేకరించిన చెత్తను దీప్తిశ్రీ నగర్‌లోని చెత్త డంపింగ్ యార్డుకు తరలిస్తారు. చెత్త నుంచి ప్లాస్టిక్, ఇతర మెటీరియల్‌ను తీసుకుంటామని ఆయనకు వివరించారు. ఆటో టిప్పర్, రిక్షా కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు రాజేందర్, జీహెచ్‌ఎంసీ అధ్యక్షులు గోపాల్‌నాయక్‌లు మాట్లాడుతూ డంపింగ్ యార్డు ప్రతినిధులతో మాట్లాడతానని జోనల్ కమిషనర్ చెప్పారని వెల్లడించారు.

## పీఆర్టీయూ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం



మహిళా టీచర్లను సన్మానిస్తున్న దృశ్యం

**నిజాంపేట్ :** బాచుపల్లి మండలం పీఆర్టీయూ అధ్యక్ష , ప్రధాన కార్యదర్శులు పర్మగళ్ల నర్సింహులు, మాలి ప్రమోద్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లోని మహిళా ఉపాధ్యాయులను కలిసి సన్మానించారు. అనంతరం ఎంఈఓ ఎంవివి రామకృష్ణ మాట్లాడుతూ.. గతంలో మహిళలు కుటుంబానికే పరిమితమయ్యారని కానీ నేడు మహిళా సాధికారతతో అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు పి.శేఖర్, జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నయ్య, మండల కార్యవర్గ సభ్యులు వెంకటేశ్వరరావు, సుమతి, శివప్రసాద్, శాంతి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు



రోడ్డు పనుల ప్రొసీడింగ్ కాపీని చూపిస్తున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

**కుత్బుల్లాపూర్ :** ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతున్నదని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. కొంపల్లి మున్సిపాలిటీలో గత జనవరిలో ఆయన పాదయాత్ర నిర్వహించగా అపర్ణ కాలనీ, నూజివీడు కాలనీవాసుల నుంచి పలు ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి, జిల్లా మంత్రి శ్రీధర్ బాబు దృష్టికి తీసుకువెళ్లి రాయల్ పార్క్ నుంచి నూజివీడు బస్టాప్ వరకు నూతన రోడ్ల నిర్మాణానికి రూ. 2.50 కోట్ల హెచ్‌ఎండీఏ నిధులు మంజూరు చేయించి సోమవారం ప్రొసీడింగ్ కాపీని రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు కూన శ్రీశైలం గౌడ్‌ను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత పదేళ్లలో ఈ విషయమై స్థానిక ప్రజాప్రతినిధులకు ఎన్నోసార్లు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. ఇప్పుడు కూన శ్రీశైలం గౌడ్ సహకారంతో రోడ్డు పనులు చేపడుతుండడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధికి మరింత కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు భైరి ప్రశాంత్ గౌడ్, సిద్దిపేట మాజీ డైరెక్టర్ జీమ్మి దేవేందర్, కాందాడి సుదర్శన్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ గోపాల్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# గుంతలతో ఒళ్లు గుల్ల..!

**కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్లలో అధ్వానంగా ప్రధాన రోడ్లు**

- ఓ వైపు గుంతలు.. మరోవైపు అధ్వానంగా మ్యాన్‌హోళ్లు
- కోట్లాది నిధులు ఉన్నా.. మరమ్మతులు శూన్యం
- కనిపించని ఐఆర్‌టీ బృందాలు
- రాకపోకలకు వాహనదారుల తీవ్ర ఇబ్బందులు



జగద్గిరిగుట్ట ప్రధాన రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం సమీపంలో గుంత



గురుమూర్తినగర్ కమిటీ హాల్ సమీపంలో..



ఐడీపీఎల్-జగద్గిరిగుట్ట రోడ్డులోని సంజయ్‌గాంధీనగర్ వద్ద..

**రంగారెడ్డినగర్:** కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలోని ప్రధాన రోడ్లు గుంతలమయంగా మారాయి. వాటికి మరమ్మతులు చేపట్టాల్సిన ఐఆర్‌టీ బృందాలు కానరాకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతూనే రాకపోకలు సాగించాల్సి వస్తోంది. అక్టోబర్‌లోనే మాన్‌సూన్ బృందాల గడువు ముగిసింది. దీంతో కూకట్‌పల్లి జోన్ పరిధిలోని 4 సర్కిళ్ల పరిధిలో దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టేందుకు 22 డివిజన్ల పరిధిలో ఐఆర్‌టీ బృందాలను ఏర్పాటు చేశారు. ఇందుకు గాను జోన్ మొత్తానికి రూ.4.5 కోట్ల నిధులు మంజూరు చేశారు. ఈ ఒక్కో బృందంలో డ్రైవర్, ఇద్దరు కార్మికులతో పాటు మరమ్మతులు నిర్వహించేందుకు సామగ్రి అందుబాటులో ఉంటుంది. అయితే కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో ఐఆర్‌టీ బృందాల పనితీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిత్యం రద్దీగా ఉండే ఐడీపీఎల్–జగద్గిరిగుట్ట రోడ్డు పలు చోట్ల ధ్వంసమైనా పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని సంజయ్‌గాంధీనగర్–జగద్గిరిగుట్ట రోడ్డులో గతేడాదిగా రోడ్డు పెచ్చులూడి గుంతలుగా మారింది. దీనికితోడూ సమీపంలోని భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోళ్లు పొంగి మురుగు నీరు గుంతల్లోకి చేరుతోంది. అదేవిధంగా జగద్గిరిగుట్ట లాస్ట్ బస్టాప్ సమీపంలోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద రోడ్డుపై పెద్ద గుంత ఏర్పడింది. ఈ విషయమై పలుమార్లు ఫిర్యాదు చేయగా రోడ్డుకు ఒక వైపే మరమ్మతులు చేపట్టి మరో వైపు వదిలేశారు. అలాగే గురుమూర్తినగర్ కమ్యూనిటీ హాల్ సమీపంలో, చింతల్ హ్యాపీ హోమ్స్ ఆస్పత్రి సమీపంలో మార్కెట్ రోడ్డు ఎంట్రన్స్‌లో, భగత్‌సింగ్‌నగర్ మోడ్రన్ ఫంక్షన్ హాల్ రోడ్డు, గాజులరామారం అయ్యప్ప కాలనీ తదితర ప్రాంతాల్లో రోడ్లు ధ్వంసమై రాకపోకలకు ఆటంకంగా మారాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఐఆర్‌టీ బృందాలతో రోడ్లకు మరమ్మతులు చేపట్టి రాకపోకలు సాఫీగా సాగేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.



చింతల్ హ్యాపీ హోమ్స్ ఆస్పత్రి సమీపంలో మార్కెట్‌కు వెళ్లే రోడ్డు..